రేపు బీఆర్ఎస్ భేటీ

పరిగి, మార్చి 21: పార్లమెంట్ ఎన్నికలకు సన్నాహకంగా పరిగిలోని ఎస్ గార్డెన్‌లో ఈ నెల 23వ తేదీ బీఆర్ఎస్ పార్టీ పరిగి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 10 గంట లకు జరిగే కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, టి.ప్రకాశ్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి పరిగి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ పార్టీ గ్రామ, మండలాల కమిటీల నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 21: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులైన బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ కోర్సుల సెమిస్టర్ రివాల్యుయేషన్ ఫలితాలతో పాటు బీసీఏ మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

ఎం.ఫార్మసీ ఫలితాల రివాల్యుయేషన్..

ఓయూ పరిధిలోని ఎం.ఫార్మసీ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎం. ఫార్మ సీ (పీసీఐ) రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 28వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 28వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు ఇంటింటి సర్వే

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 21: కుష్టువ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు డీఎల్వో డాక్టర్ అరుణ పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మార్కండేయనగర్‌లో గురువారం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్టువ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రి అనే క్రిమి ద్వారా సంక్రమిస్తుందన్నారు. ఆశ కార్యకర్తలు ద్వారా వ్యాధి లక్షణాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడంతోపాటు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు వివరించారు

కనుల పండువగా శ్రీవారి కల్యాణోత్సవం

పరిగి, మార్చి 21: పరిగి పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో చివరి రోజు గురువారం శ్రీవారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. దేవాదాయ శాఖ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో జరిగిన బ్రహ్మోత్సవాలలో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మో హన్‌రెడ్డి-ఉమాదేవి దంపతులు శ్రీవారి కల్యాణం జరి పించారు. ఉత్సవాలకు టీటీడీ పాలకవర్గ సభ్యురాలు సీతా రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బేతు గోపాల్‌రెడ్డి-యశో దమ్మల స్మారకార్థం శ్రీ వేంకటేశ్వర స్వామికి ముఖద్వారం నిర్మాణం చేయిస్తామని పరిగి జడ్పీటీసీ బి.హరిప్రియ-ప్రవీణ్ కుమార్ రెడ్డిల కుటుంబం ప్రకటించింది. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ సర్పంచ్ సిద్ధాంతి పార్థసారథి, కులకచర్ల ఎంపీపీ సత్యమ్మ, మాజీ జడ్పీటీసీ ఎస్పీ బాబయ్య, నాయకులు కె. రఘుమోహన్‌రెడ్డి, ఎ.కృష్ణ, పి.వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

సజావుగా సాగుతున్న 'పది' పరీక్షలు

ధారూరు, మార్చి 21: పదో తరగతి పరీక్షలు గురువారం మూడో రోజు ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కెరెళ్లిలల్లో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని ధారూరు, ధారూరు(బాలికల), నాగారం, కెరెళ్లి, కుక్కింద, తరిగోపుల, నాగసముందర్, మోమిన్‌కలాన్, కేజీబీవీ పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజర య్యారు. ధారూరు పరీక్షా కేంద్రంలో 172మందికి గాను 171మంది, కెరెళ్లి పరీక్షా కేంద్రంలో 141మందికి గాను 141మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడవ రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

▪ ముందస్తు హోలీ సంబురాలు..

వికారాబాద్, మార్చి 21 : వికారాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు యాస్కి శిరీషా ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, హోలీ సంబురాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం కమిటీ సభ్యులు శైలజ, సోమ మేఘమాల, ముటుపూరి అనురాధ, కుంచం దీప, కొడంగల్ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కటకం స్వప్న, వాసవి మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్థిరమైన గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించాలి

• ఎన్ఐఆర్‌డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 21: వ్యవసాయ, అనుబంధ రంగాలపైనే ఎక్కువగా ప్రజలు ఆధారపడి జీవనం కొనసాగిస్తారని జాతీయ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్డీ పీఆర్) డైరెక్టర్ జనరల్ జి.నరేంద్ర కుమార్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్డీలో ఏర్పాటు చేసిన 'గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కృత్రిమ మేధస్సు'పై రెండు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పీఆర్ చట్టాలపై అధికారులకు అవగాహన ఉంటేనే పల్లెలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న ఇండియా వంటి దేశాల్లో అవసరమని అన్నారు. వ్యవసాయ రంగానికి అనువైన నేలలు, వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలకు ఆశించిన స్థాయిలో అవగాహన పెంచాల్సిన అవసరం మనపై ఉందని పేర్కొన్నారు. ఆర్డీ, పీఆర్ కార్యక్రమాల్లో వివిధ నేపథ్య రంగాలపై స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు. ప్యానల్ చర్చలను కలిగిన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్యా పథకం అమలు, ఆడిట్ ప్రక్రియ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థిక అంశాల్లో కీలకమైన నేపథ్యం, ఏ-1 ఆవశ్యకత పై సుదీర్ఘంగా చర్చించారు. కార్యాచరణ సామర్థ్యం, జవాబుదారీతనం మెరుగు పర్చడానికి, ప్రజల విశ్వాసాన్ని పెంచాలని అన్నారు. ఈ సందర్భంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో అదనపు కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్‌కుమార్, ఎంఓ పీఆర్ పంచాయతీరాజ్ పాల్గొని సిస్టమ్ ప్రాముఖ్యతను ప్రస్తావించారు. యూఎస్ఏ, బెల్జియం, ఇండియాకు చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, విధాన నిపుణులతో సహా ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ నిపుణులు తమ నైపుణ్యాన్ని పంచుకున్నారు. ప్రకాశ్‌కుమార్, ఆర్టీడీ డాక్టర్ రాజన్, ఐఐటీ రిజిస్ట్రార్ రవీంద్ర మాట్లాడారు. అనంతరం వివిధ సాధనాలు, నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల, కళాశాలల, అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఐఆర్‌డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్

జంతు వ్యాధుల అధ్యయనానికి ఏకీకృత విధానం

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): జంతు సంబంధిత వ్యాధుల అధ్యయనానికి జాతీయ స్థాయిలో ఏకీకృత విధానాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో - గచ్చిబౌలిలోని గౌలిదొడ్డి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) వేదికగా కన్సార్టియం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో బ్యాక్టీరియా, వైరల్, ప్రోటోజోవా, ఆహార కల్తీ ఆధారంగా పశువులు, పందులకు సంక్రమించే వ్యాధుల గుర్తింపు, నియంత్రణ, చికిత్స విధానాలతో పాటు ఏకీకృత పశువైద్య విధానాలను రూపొందించడమే లక్ష్యంగా కృషి చేయనున్నారు. అదే విధంగా పొంచి ఉన్న పశు సంబంధిత వ్యాధులను ముందుగానే గుర్తించడానికి ఈ కన్సార్టియం వేదికగా జరగనుంది. రెండ్రోజుల పాటు నిర్వహించిన సమావేశంలో నార్త్ ఈస్ట్ రాష్ట్రాలతో పాటు, అన్ని రాష్ట్రాల పరిశోధకులు హాజరయ్యారు.

పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలి

కులకచర్ల, మార్చి 21: పన్నులు చెల్లించి గ్రామా భివృద్ధికి సహకరించాలని కులకచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్నులు వసూలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

బీవోఎం ఆధ్వర్యంలో ఆలిండియా హిందీ సెమినార్

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో ఆలిండియా హిందీ సెమినార్ నిర్వహించారు. ఢిల్లీ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అధికార భాషా సెక్రటరీ ఆన్షులీ ఆర్యతో పాటు, బీవోఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశీష్ పాండే, జీఎంలూ చిత్ర దతార్, రాజేశ్ కుమార్, జోనల్ మేనేజర్లు హరి శంకర్, డీజీఎం రాజేంద్ర శ్రీవాస్తవ, డైరెక్టర్ జగ్జిత్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ధర్మబీర్‌తో పాటు బ్యాంకింగ్ నిపుణులు, కేంద్ర హోం శాఖ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికార భాషా సెక్రటరీ అన్షూలీ ఆర్యా మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో బ్యాంకింగ్ సంస్థలు వెన్నుముకలా పనిచేస్తున్నాయన్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు బ్యాంకింగ్ సేవలను విస్తరించడంలో హిందీ భాషా ముఖ్య భూమికను పోషిస్తుందన్నారు. హిందీ భాషాభివృద్ధికి బీవోఎం తీసుకున్న సేవలను అభినందించారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

కులకచర్ల, మార్చి 21 : మండల కేంద్రం లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సెక్టోరియల్ అధికారి మహేశ్, కులకచర్ల ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీని వాస్‌రెడ్డి ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ఓటు హక్కును వినియో గించు కునేందుకు అన్ని విధాల సదుపా యాలు కల్పించాలని తెలిపారు.

టీ హబ్‌తో వెంచర్ బ్లిక్ ఒప్పందం

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రంగా పురుడు పోసుకున్న ఆవిష్కరణలకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ కల్పించేలా టీ హబ్, ప్రముఖ హెల్త్ కేర్ ఇన్నోవేషన్ సంస్థ వెంచర్ బ్లిక్ కలిసి పనిచేయనుంది. ఈ మేరకు టీ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో వెంచర్ బ్లిక్ దక్షిణాసియా ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ కైలాష్ జియాల్ దాసాని, వెంచర్‌బ్లిక్ వ్యవస్థాపకుడు సీఈవో క్రిస్ లీ, టీ హబ్ సీవోవో ఆంథోని అనీష్ సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతర్జాతీయంగా ఉన్న దేశాల మధ్య హెల్త్ కేర్ టెక్నాలజీ వినియయానికి ఇదొక సరైన వేదిక అవుతుందన్నారు. అదే విధంగా వెంచర్ బ్లిక్ అందించే వైద్య పరికరాలను 70 నుంచి 80 శాతం భారత దేశం దిగుమతి చేసుకుంటుందని, ప్రపంచ దేశాలకు వినూత్నమైన ఆరోగ్య సంరక్షణ సాంకేతికతను అందించేలా భారతీయ పారిశ్రామికవేత్తలకు ఈ ఒప్పందం ద్వారా ప్రోత్సాహం లభించనుంది. మెడికల్ ధ్రువీకరణ, క్లినికల్ ట్రయల్స్, మార్కెట్ మ్యాపింగ్, రెగ్యులేటరీ ఆమోదాలు, మార్కెటింగ్ వ్యూహాలు వంటి అంశాలపై ఆంత్రప్రెన్యూర్లకు ఈ వేదిక ద్వారా సహకారం అందించనున్నారు. విస్తృతమైన అంతర్జాతీయ మార్కెట్‌తో 60 దేశాలకు చెందిన 2వేలకు పైగా వైద్య నిపుణులు, డొమైన్ నిపుణుల నెట్‌వర్క్‌ను కలిగి ఉండగా, టీ హబ్ వేదికగా ఆవిష్కరించే హెల్త్ కేర్ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ దొరికే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

కళా ప్రక్రియలను పరిరక్షించుకోవాలి

జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంగారి రాజేందర్

తెలుగు యూనివర్సిటీ, మార్చి 21: సంగీతం, సాహిత్యం, కళా ప్రక్రియలు మానవ జీవితానికి ముడిపడి ఉండే ప్రక్రియలని, వాటిని పరిరక్షించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంగారి రాజేందర్ (జింబో) అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగం ఆధ్వర్యంలో 2022వ సంవత్సరానికి గాను వివిధ రంగాలలో విశేషమైన కృషి చేసిన ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 23 మంది ప్రముఖులకు కీర్తి పురస్కారాలను వర్సిటీ ఆడిటోరియంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంగారి రాజేందర్ ప్రసంగిస్తూ, కళా ప్రక్రియలను పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య టి.కిషన్‌రావు ప్రసంగిస్తూ, పురస్కార గ్రహీతల కృషిని తన ప్రసంగంలో కొనియాడారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి ప్రసంగించారు. జానపద కళల శాఖ అధిపతి డాక్టర్ లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన డప్పు వాయిద్య ప్రదర్శనను వీక్షించిన ఆహూతులను అభినందించారు.

దశాబ్దాలుగా మీడియా రంగానికి సేవలందిస్తున్నందుకుగాను డాక్టర్ జి.అమృలత కీర్తి పురస్కారాన్ని నమస్తే తెలంగాణ పత్రిక కార్టూనిస్టు మృత్యుంజయకు ప్రదానం చేస్తున్న జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంగారి రాజేందర్, తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య టి. కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్

తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలను ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు(సాహిత్య విమర్శ), కొల్లాపురం విమల(మహిళాభ్యుదయం), కొడాలి వెంకటేశ్వరరావు (లలిత సంగీతం), ప్రసన్న కుమారి (శాస్త్రీయ సంగీతబం), ఎస్.కె.బాబూజీ (జానపద కళలు), రంగరాజు పద్మజ (ఉత్తమ రయయిత్రి), నామని సుజాతాదేవి (ఉత్తమ రచయిత్రి), డాక్టర్ కె.శ్రీదేవి (నవల), లలితారాజ్ (ఉత్తమ నటి), మోహన్ సేనాపతి (ఉత్తమ నటుడు), గరికపాటి కాళిదాస్ (నాటక రంగంలో కృషి) డాక్టర్ ఆర్.ఎల్.వి.రమేష్(ఆంధ్ర నాట్యం), డాక్టర్ ఎస్పీ భారతి (కూచిపూడి నృత్యం), జి.వి.ఎన్.రాజు (వ్యక్తిత్వ వికాసం), షరీఫ్ గోరా (హేతువాద ప్రచారం కృషి), డాక్టర్ చేగోని రవి కుమార్ (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), అనుముల శ్రీనివాస్ (గ్రంథాలయకర్త), మాడిశెట్టి గోపాల్ (సాంస్కృతిక సంస్థ నిర్వహణ), బీవీ సత్య నగేష్ (ఇంద్రజాలం), మృత్యుంజయ (కార్టూనిస్ట్), డాక్టర్ నూనె వెంకటయ్య (జ్యోతిషం), సి. రామనాథ శర్మ (ఉత్తమ ప్రధానోపాధ్యాయులు), గౌరి వేముల(చిత్రలేఖనం) విభాగాలకు గాను అందుకున్నారు. ఒక్కొక్కరికి రూ.5,116ల నగదు, శాలువాతో ఘనంగా సత్కరించారు.

▪ మొక్కలు నాటిన అధికారులు

ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటుతున్న అటవీ శాఖ సిబ్బంది

వికారాబాద్, మార్చి 21 : ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో గురువారం సిబ్బంది మొక్కలు నాటా రు. 25 మంది సిబ్బంది 25 మొక్కలను కార్యాలయ సమీపంలో అదేవిధంగా నర్సరీల్లో నాటారు. నీటిన మొక్కలకు నీరు పోశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో అరుణ, ఎఫ్ఎస్‌వో అరుణ, ఎఫ్ఎస్‌వో ఫరీద్, బీట్ ఆఫీసర్ మధుకర్, వీరబాబు, కార్తిక్, మహేశ్ తదితరులున్నారు.

▪ పారిశుధ్య పనులు తనిఖీ

వికారాబాద్, మార్చి 21 : పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల సిబ్బందిని ఆదేశించారు. గురువారం పట్టణంలో శానిటేషన్ పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలో ఎక్కడ కూడా చెత్తాచెదారం కనిపించకూడదన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆమె వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్‌న్నారు.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

ఇబ్బందుల్లో వాహనచోదకులు, పాదచారులు



కులకచర్ల, మార్చి 21 : మండల కేంద్రంలోని పెద్ద గేట్ చౌరస్తాలో వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు. మండలంలో 44 గ్రామ పంచాయతీలున్నాయి. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తూ ఉంటారు. దీంతో ప్రతిరోజూ పెద్ద గేట్ చౌరస్తా రద్దీగా ఉంటుంది. అదేవిధంగా పరిగి-మహబూబ్‌నగర్ రోడ్డుకు ఇరువైపులా వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతుండ డంతో పాదచారులు, వాహనచోదకులు, ప్రజలు ఇబ్బంది పడుతు న్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

▪ ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..

పెద్దేముల్, మార్చి 21 : మండల కేంద్రంలోని చిన్న మసీదు ముందు విద్యుత్ తీగలు అత్యంత ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు మసీదు కమిటీ వాళ్లు అధి కారులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. రంజాన్ మాసం పురస్కరించుకొని అధికారులు ఇప్పటికైనా చొరవ చూపి విద్యుత్ తీగలు సరిచేయడంతో పాటు ఒక పెద్ద డేలైట్ కూడా ఏర్పాటు చేయాలని ముస్లింలు కోరుతున్నారు.

సన్‌సిటీకాలనీలో అర్ధరాత్రి సంచారం

- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

కొడంగల్, మార్చి 21 : సన్‌సిటీకాలనీలో అర్ధరాత్రి సంచరించిన గుర్తుతెలియని వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి 12 గంటలకు పట్టణంలోని సన్‌సిటీకాలనీలోని గోపాల్ ఇంట్లోని కుక్క అరవడంతో అతడు బయటికి వచ్చి చూశాడు. బొలెరో వాహనంలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అనుమానం వచ్చి ఆ కాలనీకే చెందిన నర్సింహులుతో కలిసి ఆ ప్రాంతంలో పరిశీలించారు. పొదలచాటున వ్యక్తులు ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో ఎస్ఐ భరత్‌రెడ్డి తన సిబ్బందిని కాలనీకి పంపించారు. పోలీసుల రాకను గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు పారిపోయేందుకు తమ వాహనంలో బొంరాస్‌పేట వైపు వెళ్లారు. వారిని పట్టుకునేందుకు స్థానిక పోలీసులు బొంరాస్‌పేట పోలీసులను అప్రమత్తం చేయడంతో వారు తుంకిమెట్ల గ్రామం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. తుంకిమెట్ల వద్ద బారికేడ్లను గమనించిన దుండగులు బొలెరోలో మళ్లీ కొడంగల్ వైపు వచ్చారు. కొడంగల్ అంబేద్కర్ కూడలిలో పోలీసులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అందులో ఓ వ్యక్తి చిక్కాడు. అతడి వద్ద చోరీకి అవసరమయ్యే స్క్రైడ్రైవర్, కట్టర్ వంటి పరికరాలు ఉన్నా యని.. శాంతినగర్ కాలనీ, సన్‌సిటీ కాలనీల్లో తాను సంచరించిన ప్రదేశాలను చూపించిన ట్లు ఎస్ఐ తెలిపారు. వారం రోజుల క్రితం లాహోటీ కాలనీలో జరిగిన చోరీ ఈ వ్యక్తులే చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. సీసీ పుటేజీల ద్వారా సమాచారాన్ని సేకరిస్తు న్నామని.. పట్టుబడ్డ వ్యక్తి కర్ణాటక రాష్ట్రానికి చెందిన వాడిగా ఆధారాలు ఉన్నాయన్నారు. మిగిలిన వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజలకునికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరామ ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Smt. Chavan Laxmi W/o Tharya Naik, age: 30 years, Occ: Housewife, R/o H.No.4-3, Mothkulabanda Thanda, Tekalkode Village, Kodangal Mandal, Vikarabad Dist **Applicant / Borrower,** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 3 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.

SCHEDULE OF THE PROPERTY

Residential house bearing No.4-66, assessment No.395, constructed in residential plot admeasuring 200.44 Sq.Yrds., plinth area 1056 SFT., covered by stone roof, situated at Tekalkode village shivara of kodangal mandal, Vikarabad Dist., which is bounded as under; **East:** 3Ft seri &house of Roopla Naik, **West:** 3Ft seri &house of Harya Naik, **North:** Agri. Land of Rathod Pathi Bai, **South:** CC Road.

MALLIKARJUN B.A, LL.B., Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా Client బొప్పి నర్సిములు S/o. బొప్పి సాయబన్న తనకు సంబంధించిన Link Document No. 2708/2005 తేది: 02-11-2005 మిగతా డాక్యుమెంట్‌తో కలిసి RTC బస్సులో హైదరాబాద్ వెళుతున్న సమయంలో తాండూర్ నందు 15-01-2024 నాడు పోయినది. అట్టి విషయమై ఎంత వెతికిన దొరకలేదు. పోలీస్ స్టేషన్ తాండూర్‌లో దాని విషయంపై ఫిర్యాదు చేశాను. పోలీస్‌వారు అందు నిమిత్తమై ఆ డాక్యుమెంట్ దొరకనట్లుగ సర్టిఫికెట్ జారీ చేశారు. పై డాక్యుమెంట్ 2708/2005 తేది: 02-11-2005 దొరికినచో ఈ క్రింది Addressకి 7 దినములలోపల పంపించవలసిందిగా కోరుతున్నారు.

ఇట్లు:

G. శ్రావణ్ కుమార్, న్యాయవాది
తాండూర్
సెల్ నం.: 9989365538